

న్యాయవాద దంపతులపై దాడిని నిరసిస్తూ విధులు బహిష్కరించిన న్యాయవాదులు

## రంగారెడ్డి కోర్టులో న్యాయవాదుల నిరసన

ఆర్కేపురం, ఆగస్టు 8 : న్యాయవాదులు అమృతరావు, కవిత దంపతులపై జనగామ అర్బన్ పీఎస్‌లో సీఐ రఘుపతిరెడ్డి, ఎస్ఐ తిరుపతి, ఇతర పోలీసు సిబ్బంది దాడిని నిరసిస్తూ గురువారం న్యాయవాద దంపతులకు మద్దతుగా ఫెడరేషన్ ఆఫ్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా కోర్టు న్యాయవాదులు కోర్టు విధులను బహిష్కరించి నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీనియర్ న్యాయవాది జిల్లా రమణారావు మాట్లాడుతూ ఫెడరేషన్ ఆఫ్ బార్ అసోసియేషన్ తెలంగాణ పిలుపు మేరకు రెండు రోజుల పాటు విధులు బహిష్కరించి ధర్నా చేపడుతున్నట్లు తెలిపారు. నేడు డీజీపీ కార్యాలయాన్ని ముట్టడించనున్నట్లు పిలుపునిచ్చారు. దాడి చేసిన పోలీసులపై కేసు నమోదు చేసి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, సీఎం, హోంమంత్రి, లా మినిస్టర్, గవర్నర్‌కు వినతి పత్రాలు ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో కొండల్‌రెడ్డి, కృష్ణ, సైదులు, శేఖర్, హరికుమార్, ఎస్.ఎస్.రావు, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## నిజాం యూజీ విద్యార్థులకు న్యాయం చేయండి

మాజీ విద్యాశాఖ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డిని కలిసిన నిజాం కాలేజీ యూజీ విద్యార్థినులు

బడంగ్‌పేట, ఆగస్టు 8: నిజాం కళాశాలలో విద్యార్థినుల కోసం గత ప్రభుత్వం నిర్మించిన హాస్టల్‌ను వంద శాతం యూజీ విద్యార్థినులకు కేటాయించే విధంగా చర్యలు తీసుకోవాలని కళాశాల విద్యార్థులు మాజీ విద్యాశాఖ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డిని గురువారం ఆమె నివాసంలో కలిశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం యూజీ విద్యార్థినుల కోసం ఏర్పాటు చేసిన హాస్టల్‌ను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం యూజీ విద్యార్థులకు 50 శాతం, పీజీ విద్యార్థినులకు 50 శాతం కేటాయిస్తున్నారని ఆమెకు వివరించారు. దీంతో ఇబ్బంది అవుతుందన్నారు. పీజీ విద్యార్థినులకు హాస్టల్ ఉండగా, తమ కోసం గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన హాస్టల్‌ను పీజీ విద్యార్థినులకు ఎలా కేటాయిస్తారన్నారు. అందుకు సబితా ఇంద్రారెడ్డి స్పందిస్తూ ప్రొఫెసర్ భీమ్ నాయక్‌తో ఫోన్‌లో మాట్లాడారు. గతంలో తీసుకున్న నిర్ణయం ప్రకారం హాస్టల్ కేటాయింపులు జరిపి యూజీ విద్యార్థులకు న్యాయం చేయాలన్నారు.

### సర్వీస్ రోడ్డు పనులు తర్వాత..

# ముందు ఫ్లైఓవర్ పనులు చేద్దాం

- ఫ్లై ఓవర్ దగ్గరకు వచ్చిన వక్ఫ్ బోర్డు చైర్మన్ అజ్మతుల్లాఖాన్
- సర్వీసు రోడ్డు విషయంలో సంబంధిత ఉన్నతాధికారులతో చర్చిస్తామన్న చైర్మన్

గోల్నాకలోని మసీదు ప్రాంతాన్ని సందర్శించిన వక్ఫ్ బోర్డు చైర్మన్ అజ్మతుల్లాఖాన్

అంబర్‌పేట, ఆగస్టు 8: అంబర్‌పేట ఛే నంబర్ ఫ్లై ఓవర్‌కు సంబంధించి గోల్నాక మసీదు-ఏ-మహ్మద్ ఇస్మాయిల్ వద్ద సర్వీస్ రోడ్డు పనులను పక్కన పెట్టి ముందు ఫ్లైఓవర్ నిర్మాణం పనులు చేయండని వక్ఫ్ బోర్డు చైర్మన్ అజ్మతుల్లాఖాన్ సంబంధిత అధికారులకు చెప్పారు. ఈ ఫ్లైఓవర్ నిర్మాణం..దాని పక్కన నిర్మించే సర్వీసు రోడ్డు వల్ల స్థానికంగా ఉన్న మసీదు, అక్కడ ఉన్న గ్రేవ్ యార్డుకు నష్టం వాటిల్లుతుందనే పుకార్లు షికార్లు చేయడం, అక్కడ కొందరు ఫ్లై ఓవర్ నిర్మాణ పనులు ఆపేయడంతో విషయాన్ని తెలుసుకున్న వక్ఫ్ బోర్డు చైర్మన్ గురువారం ఇక్కడకు వచ్చారు. దీంతో ఆర్ అండ్ బీ, జీహెచ్ఎంసీ, పోలీసు అధికారులు కూడా వచ్చారు. మసీదుకు సంబంధించి అఫ్జల్, సల్వా గార్డెన్‌కు సంబంధించి మున్వర్‌లు విషయాన్ని వక్ఫ్ బోర్డు చైర్మన్‌కు తెలిపారు. అదే విధంగా సర్వీసు రోడ్డు నిర్మాణానికి అడ్డుగా వస్తున్న గ్రేవ్ యార్డుపై నుంచి చిన్న ర్యాంపు వంటిది ఏర్పాటు చేయాలని కోర్టు తీర్పును కూడా ఆయన దృష్టికి తెచ్చారు. అన్ని విషయాలు తెలుసుకున్న అజ్మతుల్లాఖాన్ ముందు ఫ్లైఓవర్ పనులు పూర్తి చేయాలని సంబంధిత ఆర్ అండ్ బీ అధికారులకు చెప్పారు. సర్వీసు రోడ్డుతో వస్తున్న ఇబ్బందులను తర్వాత చర్చిద్దామన్నారు. దానికి ఉన్నత స్థాయిలో అధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుందామని తెలిపారు. మసీదు, గ్రేవ్ యార్డుకు ఎలాంటి నష్టం జరగకుండా నిర్మాణం జరుగుతుందని, పనులు ఏవీ కూడా ఆపొద్దని పేర్కొన్నారు.

ఓపెన్ టెక్స్ కార్యాలయంలో హోప్ ఇన్ ఏ కప్ కేఫ్‌ను ప్రారంభిస్తున్న ప్రతినిధులు

## ఎల్జీబీటీ కమ్యూనిటీకి అండగా.. హోప్ ఇన్ ఏ కప్ కేఫ్

కొండాపూర్, ఆగస్టు 8: ఎల్జీబీటీ కమ్యూనిటీకి మద్దతుగా ఓపెన్ టెక్స్ నిలుస్తుందని ఈక్విటీ, డైవర్సిటీ, ఇన్‌క్లూజన్, ఓపెన్ టెక్స్ వైస్ ప్రెసిడెంట్ వైవోన్ థామ్సన్ అన్నారు. హైటెక్ సిటీ రహేజా మైండ్‌స్పేస్ ఐటీ కారిడార్‌లోని ఓపెన్ టెక్స్ కార్యాలయంలో ఎల్జీబీటీ కమ్యూనిటీకి మద్దతుగా, వారికి చేయూతనిచ్చే దిశగా కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా నిర్మాణ్ ఆర్గనైజేషన్ భాగస్వామ్యంతో 'హోప్ ఇన్ ఏ కప్' కేఫ్‌ను గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వైవోన్ థామ్సన్ మాట్లాడుతూ.., కేఫ్ ఏర్పాటుకు స్థలంతో పాటు మౌలిక సదుపాయాలను కల్పించనున్నట్లు తెలిపారు. రూ.25 లక్షల వ్యయంతో కేఫ్‌ను ఏర్పాటు చేసినట్లు, దీని ద్వారా వచ్చే ఆదాయం ఎల్జీబీటీ కమ్యూనిటీలోని అట్టడుగు, తక్కువ ప్రాధాన్యత ఉన్న వారి బాగోగులకు వినియోగించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నిర్మాణ్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకుడు, ప్రెసిడెంట్ మయూర్ పట్నాల, ఓపెన్ టెక్స్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ మనోజ్ నాగ్‌పాల్, సంగీత పాల్గొన్నారు.

# యూజీ విద్యార్థినుల నిరసనకు తాత్కాలిక బ్రేక్

సుల్తాన్ బజార్, ఆగస్టు 8: నిజాం కళాశాలలోని గర్ల్స్ హాస్టల్‌ను పూర్తి స్థాయిలో యూజీ విద్యార్థినులకే కేటాయించాలని చేపడుతున్న నిరసనలను విద్యార్థినులు తాత్కాలికంగా నిలిపివేశామని యూజీ విద్యార్థినులు స్పష్టం చేశారు. ఈ మేరకు గురువారం ఆరో రోజు కళాశాల యూజీ విద్యార్థులు చింత చెట్టు వద్ద ప్లకార్డులు ప్రదర్శిస్తూ విన్నూత్న రీతిలో వంటా వార్పు చేపట్టి నిరసనలు తెలిపారు. నిరసనలు ఐదో రోజుకు చేరాయి. యూజీ విద్యార్థినులకు పూర్తి స్థాయిలో హాస్టల్ వసతి కేటాయించేంత వరకు తమ పోరాటం ఆగదని విద్యార్థులు, విద్యార్థినులు చింత చెట్టు వద్ద భీష్మించారు. విద్యార్థినులు చేపడుతున్న నిరసన ప్రాంతాన్ని ఎంఎల్‌సీ బల్మూరి వెంకట్ సందర్శించి ఈ ఏడాది సెప్టెంబర్‌లో పీజీ విద్యార్థినుల అకాడమిక్ ఇయర్ పూర్తవుతుందని తదనంతరం 100 శాతం యూజీలకే హాస్టల్ కేటాయిస్తామని ఆయన యూజీ విద్యార్థినులకు సముదాయించారు. ఈ విషయమై మూడు రోజుల్లో అధికారికంగా సర్క్యులర్ జారీ చేస్తామని హామీనిచ్చారు. ఈ సందర్భంగా పీజీ విద్యార్థినులు తమకు న్యాయం చేయాలని ఎంఎల్‌సీని కోరారు. గర్ల్స్ హాస్టల్‌ను డిగ్రీ విద్యార్థినులకే కేటాయిస్తే తాము ఓయూ నుంచి రావలసి రావడంతో పాటు ట్రాఫిక్‌లో బస్సులలో సమయానికి కళాశాలకు చేరుకోలేక పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంఎల్‌సీ బల్మూరి వెంకట్ మాట్లాడుతూ ఓయూ వీసీతో చర్చించి సమస్యను పరిష్కరిస్తానని హామీనిచ్చారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు రోడ్ సైడ్ మిర్రర్ ఏర్పాటు

సంస్థాన్ నారాయణపురం, ఆగస్టు 8 : మండలంలోని మూలమలుపుల వద్ద ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించకపోడంతో వాహనదారులు రోడ్డు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ క్రమంలో రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు మండల కేంద్రంలోని సత్యనారాయణస్వామి దేవాలయం వారు లక్షా 30వేల రూపాయలతో మండల వ్యాప్తంగా ప్రమాదకరంగా ఉన్న 21చోట్ల రోడ్ సైడ్ మిర్రర్లు ఏర్పాటు చేశారు. దాంతో మూలమలుపుల వద్ద ఎదురుగా వస్తున్న వాహనాలు రోడ్ సైడ్ మిర్రర్‌లో కనిపిస్తుండడతో రోడ్డు ప్రమాదాలు తగ్గుతాయని వాహనదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

మండల కేంద్రంలోని మూలమలుపు వద్ద ఏర్పాటు చేసిన రోడ్ సైడ్ మిర్రర్

## పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు

ఆలేరులో సభ్యత్వ నమోదులో పాల్గొన్న ఉపాధ్యాయులు

ఆలేరు రూరల్, ఆగస్టు 8 : మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్‌లో గురువారం పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు రామ్మోహన్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల నుంచి సభ్యత్వాలు స్వీకరించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు వెంకన్న, సోమరాజు, నాగయ్య, జోసబ్, ఖాజాఅలీ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## మోడల్ పాఠశాలకు డస్ట్ బిన్‌లు అందజేత

బొమ్మలరామారం, ఆగస్టు 8 : స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమంలో భాగంగా రోటరీ క్లబ్ భువనగిరి డైరెక్టర్ ర్యాకల శ్రీనివాస్ తెలంగాణ మోడల్ స్కూల్‌కు గురువారం డస్ట్‌బిన్‌లు అందజేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యుడు జ్ఞానప్రకాశ్ రెడ్డి, ఉపాధ్యాయులు శ్రీనయ్య, రవిబాబు, మహేశ్ పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌కు డస్ట్ బిన్‌లు అందజేస్తున్న రోటరీ క్లబ్ డైరెక్టర్ ర్యాకల శ్రీనివాస్

అమీర్‌పేటలో చెట్ల కొమ్మలు విరిగిపడటంతో తెగిపోయిన విద్యుత్ తీగలు(ఫైల్)

# డిస్కం.. నిర్లక్ష్యం

- మొక్కుబడిగా విద్యుత్ నెట్‌వర్క్
- క్షేత్ర స్థాయి సర్వేలో బయటపడిన లోపాలు
- ప్రమాదకరంగా 12,598 స్తంభాలు
- కంచెలు లేకుండా 1,320 ట్రాన్స్‌ఫార్మర్లు
- అధ్వాన నెట్‌వర్క్‌తోనే తరచూ అంతరాయాలు
- లోపాలు సరిబిద్దేందుకే రూ. 25 కోట్లు

*ప్రమాదకరంగా స్తంభాలు..కంచెలు లేని ట్రాన్స్‌ఫార్మర్లు.. కాలం చెల్లిన పరికరాలు... క్షేత్రస్థాయిలో విద్యుత్ నెట్‌వర్క్ తీరిది. ఈ కారణంగానే తరచూ అంతరాయాలు ఏర్పడుతున్నాయి. డిస్కం నిర్లక్ష్యాన్ని ఎత్తిచూపుతున్నాయి. సర్వేలో బయటపడిన ఈ లోపాలను సరిబిద్దేందుకే రూ. 25 కోట్ల వ్యయం అవుతుండటం కొసమెరుపు.*

-సిటీబ్యూరో, ఆగస్టు 8 (నమస్తే తెలంగాణ)

అత్యంత కీలకమైంది క్షేత్ర స్థాయిలోని విద్యుత్ నెట్‌వర్క్. అలాంటి నెట్‌వర్క్‌లో ఎలాంటి లోపాలు లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత విద్యుత్ శాఖ యంత్రాంగానిదే. డిమాండుకు సరిపడా కరెంటు ఉన్నా... అంతరాయాలు మాత్రం నిత్యకృత్యంగా మారాయి. అయితే క్షేత్ర స్థాయిలోని నెట్ వర్క్ ప్రధానమని విద్యుత్ రంగ నిపుణులు చెబుతున్నా.. అధికారులు నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారు. ఒక సబ్ స్టేషన్ నుంచి 11 కేవీ ఫీడర్ల ద్వారా ట్రాన్స్‌ఫార్మర్లు, అక్కడి నుంచి ఎల్ టీ లైన్ల ద్వారా ఇంటింటికీ సరఫరా జరిగే నెట్‌వర్క్‌లోనే చాలా లోపాలు ఉన్నాయని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ చేపట్టిన 11 కేవీ ఫీడర్ సర్వేలోనే తేలింది. సుమారు రెండు నెలల పాటు జరిగిన సర్వేలో టీజీఎస్‌పీడీసీఎల్ పరిధిలో ప్రమాదకరంగా 12,598 స్తంభాలు ఉన్నాయని, అదేవిధంగా 1320 ట్రాన్స్‌ఫార్మర్లు కంచెలు లేకుండా ఉన్నట్లు గుర్తించారు. ఇవే కాకుండా స్తంభాలపై ఎలక్ట్రిక్ పరికరాలు కాలం చెల్లినా.. వాటిని మార్చకుండా అలాగే ఉంచడం గమనార్హం.

### చెట్ల కొమ్మల తొలగింపులోనూ..

క్షేత్రస్థాయిలో ఏటా తరచూ చేపట్టాల్సిన చెట్ల కొమ్మల తొలగింపు విషయంలోనూ అధికార యంత్రాంగం నిర్లక్ష్యం వహించింది. దీంతో గాలి, వానకు చాలా చోట్ల చెట్లు, వాటి కొమ్మలు విద్యుత్ తీగలపై పడటంతో సరఫరాలో అంతరాయం తలెత్తుతున్నది. ఈ నేపథ్యంలో డిస్కం పరిధిలోని అన్ని సర్కిళ్ల పరిధిలో సమర్థవంతంగా విద్యుత్ సరఫరా వ్యవస్థను నిర్వహించేందుకు ఇటీవల చేపట్టిన 11 కేవీ సర్వే ద్వారా లోపాలను గుర్తించి.. వాటిని సరిచేసే కార్యాచరణను సిద్ధం చేశారు.

### రూ. 25 కోట్లతో మరమ్మతులు

డిస్కం పరిధిలోని 11 కేవీ ఫీడర్ సర్వేలో గుర్తించిన లోపాలను సరిచేసేందుకు సుమారు రూ.25.50 కోట్ల నిధులను కేటాయించారు. మరమ్మతు పనులు చేపట్టాలని క్షేత్ర స్థాయిలోని అధికారులకు ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. విద్యుత్ నెట్‌వర్క్‌లో ఎలాంటి లోపాలు లేకుండా సమర్థవంతంగా సరఫరా ఉండేలా పనులు చేపట్టాలని స్పష్టం చేశారు. చేసే పనులు సైతం వీడియో, ఫొటోలు తీసి.. కొత్తగా అందుబాటులోకి తెచ్చిన యాప్‌లో పొందుపర్చాలని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సీఎండీ ముషారఫ్ ఫరూఖీ ఆదేశించారు. విద్యుత్ లైన్ల మరమ్మతు పనులు చేసే కాంట్రాక్టర్లు ఎలాంటి అవకతవకలకు పాల్పడకుండా ఉండేందుకు ఫొటోలను జీఐఎస్ కోఆర్డినేట్స్‌తో పాటు యాప్‌లో అప్‌డేట్ చేయాలన్న నిబంధనను పెట్టి, పారదర్శకంగా పనులు పూర్తి చేయిస్తున్నారు. సెక్షన్ స్థాయిలోని అధికారులు విద్యుత్ స్తంభాలు, తీగలు, ట్రాన్స్‌ఫార్మర్ల పనితీరును నిరంతరం పర్యవేక్షణ చేస్తూ కొత్తగా రూపొందించిన యాప్‌లో లోపాలను వెంటనే నమోదు చేసే విధానాన్ని కచ్చితంగా అమలు చేయనున్నారు. దీనిద్వారా అంతరాయాలు తగ్గి.. నిరంతరం నాణ్యమైన సరఫరాకు దోహదపడుతుందని అధికారులు భావిస్తున్నారు.

# ఆదివాసీ గూడేలు అభివృద్ధి చెందాలి

బీఆర్ఏఓయూలో నిర్వహించిన సదస్సును ప్రారంభించిన మంత్రి సీతక్క

సిటీబ్యూరో, ఆగస్టు 8(నమస్తే తెలంగాణ): సమాజంలో ఎంతో వెనుకబడి ఉన్న గిరిజనులు అభివృద్ధి చెందినప్పుడే నిజమైన అభివృద్ధి జరిగినట్టు అని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క అన్నారు. గురువారం జూబ్లీహిల్స్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో రెండు రోజుల పాటు 'గిరిజన జీవనోపాధి పద్ధతులు- సాధికారత సాధనలో సమస్యలు వ్యూహాలు' అనే అంశంపై నిర్వహించిన సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తాను స్వయంగా ఆదివాసీ ప్రాంతం నుంచి వచ్చానని, జీవితంలో ఎన్నో సవాళ్లను ఎదుర్కొన్నానని గుర్తు చేశారు. సదస్సులో ప్రొఫెసర్ హరగోపాల్, ఓపెన్ వర్సిటీ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సుధారాణి, ప్రొఫెసర్లు గుంటి రవీందర్, వడ్డాణం శ్రీనివాస్, లక్ష్మి, డైరెక్టర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి చర్యలు

చిక్కడపల్లి: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటుందని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క అన్నారు. తెలంగాణ బాలోత్సవం ఆధ్వర్యంలో గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను ప్రదానం చేశారు. ఆమె మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలలు ప్రతిభకు నిలయాలుగా ఉన్నాయన్నారు. పాఠశాలల్లో అన్ని మౌలిక వసతులు కల్పించే విధంగా కృషి చేయడం జరుగుతుందన్నారు. తెలంగాణ బాలోత్సవం అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఈ సభలో జాతీయ సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ, మోటివేషన్ స్పీకర్ ఆకెళ్ల రాఘవేంద్ర రావు, బాలోత్సవం ప్రధాన కార్యదర్శి ఎన్.సోమయ్య పాల్గొన్నారు.

## ఇక ఇంటి వద్ద నుంచే.. శాంపిల్ కలెక్షన్

### అందుబాటులోకి 'స్టార్' కొత్త సేవలు

సిటీబ్యూరో, ఆగస్టు 8(నమస్తే తెలంగాణ): శాంపిల్ కలెక్షన్ కోసం దవాఖానకు వెళ్లాల్సిన అవసరం లేదు. ఇక నుంచి సిబ్బంది వివిధ రకాల వైద్య పరీక్షలకు సంబంధించిన శాంపిల్స్‌ను రోగుల ఇళ్ల వద్దకే వచ్చి సేకరించనున్నారు. ఈ కొత్త సేవలను బంజారాహిల్స్‌లోని స్టార్ హాస్పిటల్‌లో గురువారం ప్రారంభించారు. బంజారాహిల్స్, నానక్‌రామ్‌గూడ యూనిట్ల పరిధిలో ఈ హోమ్ శాంపిల్స్ కలెక్షన్స్ సేవలు అందుబాటులో ఉంటాయని దవాఖాన వర్గాలు వెల్లడించాయి. ఈ సందర్భంగా కార్డియో థొరాసిక్ సర్జరీ సీనియర్ కన్సల్టెంట్ డా.లోకేశ్వర్ రావు సజ్జ, రోబోటిక్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్ డా.నీలం వెంకట రమణారెడ్డి మాట్లాడుతూ, రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి వైద్య పరీక్షలకు అవసరమైన నమూనాలను సేకరించే సేవలు ప్రారంభించడం సంతోషకరమన్నారు. కార్డియాక్ సర్జరీ చేయించుకున్న రోగులు తరచు హోమ్ శాంపిల్ కలెక్షన్ గురించే అడిగేవారని, ఇప్పుడు ఈ సేవలు అందుబాటులోకి రావడంతో స్టార్ సేవలు వారి ఇండ్ల వద్దనే అందనున్నట్లు తెలిపారు. హోమ్ శాంపిల్ కలెక్షన్ వల్ల ప్రధానంగా వృద్ధాప్యంలో ఉన్న రోగులు, నడవలేని స్థితిలో ఉన్న రోగులు, శస్త్ర చికిత్సలు చేయించుకున్న రోగులకు ఎంతో ఉపయోగపడతాయన్నారు.

## నాణ్యమైన వైద్యసేవలందించాలి

వనస్థలిపురం, ఆగస్టు 8 : ప్రభుత్వ దవాఖానల్లో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ క్రిస్టినా చొంగ్తు అన్నారు. గురువారం కలెక్టర్ శశాంకతో కలిసి వనస్థలిపురం ఏరియా ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బందికి తగిన వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీసీహెచ్‌వో డాక్టర్ రాజు యాదవ టీఎస్ఎంఐడీసీ అధికారులు, వైద్యులు పాల్గొన్నారు.

## రిటైల్ డిపాజిట్‌పై అవగాహనకు వాకథాన్

సిటీబ్యూరో, ఆగస్టు 8(నమస్తే తెలంగాణ): రిటైల్ డిపాజిట్ క్యాంపెయిన్‌లో భాగంగా ఇండియన్ బ్యాంకు ఆధ్వర్యంలో గురువారం ఇందిరా పార్కు వద్ద అవగాహన వాకథాన్ నిర్వహించారు. ఈ వాకథాన్‌ను బ్యాంకు చీఫ్ జనరల్ మేనేజర్ సుధాకర్‌రావు, ఎఫ్‌జీఎం జి.రాజేశ్వర్ రెడ్డి, జోనల్ మేనేజర్ ఎస్.శ్రీనివాస రావుతో కలిసి ప్రారంభించారు. ఈ వాక్ అంబేద్కర్ విగ్రహం, ఐమ్యాక్స్ రోడ్డు మీదుగా సాగింది.

# మెరుగైన సేవలకే.. జీఐఎస్ సర్వే

- నగరమంతా మ్యాపింగ్
- డిజిటల్ బోర్డుతో అనేక ప్రయోజనాలు
- ప్రజలు ఎలాంటి అపోహలకు గురికావొద్దు..
- సర్వేకు సహకరించాలి
- బల్దియా కమిషనర్ ఆమ్రపాలి

సిటీబ్యూరో/హయాయత్‌నగర్, ఆగస్టు 8 (నమస్తే తెలంగాణ) : గ్రేటర్ ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు, పట్టణ ప్రణాళిక, వనరుల నిర్వహణను మెరుగుపరచడంపై ప్రత్యేక దృష్టి సారించిన నేపథ్యంలో జీఐఎస్ సర్వే ఎంతగానో దోహదపడుతుందని బల్దియా కమిషనర్ ఆమ్రపాలి అన్నారు. గురువారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో మీడియా సమావేశాన్ని నిర్వహించి.. జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టంపై వివరించారు. జీఐఎస్‌తో గ్రేటర్ మొత్తాన్ని డ్రోన్ ద్వారా సర్వే చేసి.. రికార్డు చేస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ భూములు, చిన్నా, పెద్ద రోడ్లు, చెరువులు, సరస్సులన్నీ.. ఇలా సిటీ మొత్తం మ్యాపింగ్ జరుగుతుందన్నారు.

### ప్రతి ఇంటికి..

దాదాపు 650 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో గల హైదరాబాద్ మహానగరంలో రెసిడెన్షియల్, కమర్షియల్ భవనాలతో కలిపి సుమారు 19 లక్షల 43 వేల నిర్మాణాలు ఉన్నట్లు కమిషనర్ వెల్లడించారు. అందులో 2.7 లక్షల కమర్షియల్ గృహాలు ఉన్నాయన్నారు. జీఐఎస్ సర్వే పూర్తయిన తర్వాత ప్రతి ఇంటికి డిజిటల్ డోర్ నంబర్ ఏర్పాటు చేస్తారని వివరించారు. ప్రతి ఇంటి ఎదుట జీఐఎస్ డిజిటల్ బోర్డు ఏర్పాటు చేయడం వల్ల ప్రజలకు అనేక ప్రయోజనాలు ఉన్నాయన్నారు. ఉదాహరణకు తమ కాలనీల్లో ఎక్కడైనా సమస్యలున్నా.. జనన, మరణ ధ్రువీకరణ పత్రం , ఆస్తుల మ్యుటేషన్, ఇతర సేవలను నేరుగా ఇంటి వద్ద నుంచే పొందవచ్చని వివరించారు. విపత్తుల సమయంలో, ప్రమాద ఘటనల్లో ప్రజలు త్వరితగతిన సేవలు పొందే అవకాశం ఉంటుందన్నారు. అలాగే ప్రకృతి వైపరీత్యాలు, ప్రమాదాలు జరిగినప్పుడు ఆయా అధికారులు వేగవంతంగా స్పందించి నేరుగా వెళ్లి సేవలు అందించే వీలు కలుగుతుందని చెప్పారు. ప్రభుత్వ స్థలాలు, చెరువులు, కుంటలు వంటివి కబ్జాలకు గురికాకుండా నిఘా ఉంటుందని కమిషనర్ తెలిపారు.ఇప్పటికే హైదర్‌నగర్, మియాపూర్, చందానగర్, కేపీహెచ్‌బీ కాలనీ, ఉప్పల్, హయత్‌నగర్‌లలో జీఐఎస్ సర్వేను ప్రారంభించామన్నారు. శాటిలైట్, గ్రౌండ్ ఫిజికల్ ద్వారా సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు 130 చదరపు కిలోమీటర్లలో డ్రోన్ సర్వే పూర్తయిందని, త్వరలో 1,40,020 ప్లాట్స్ డిజిటలైజ్ చేయనున్నట్లు చెప్పారు.

### మొత్తం 600 బృందాలు

ప్రజలు ఎలాంటి అపోహలకు గురికావద్దని, సర్వేకు సహకరించాలని కమిషనర్ కోరారు. ఈ సర్వేతో అన్ని కాలనీల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు వెసులుబాటు ఉంటుందన్నారు. మొత్తం 600 బృందాలను ఏర్పాటు చేసి, రానున్న 6 నెలల వ్యవధిలోనే సర్వే పూర్తి చేస్తామన్నారు. శాటిలైట్, డ్రోన్ ఫిజికల్ ద్వారా సర్వే నిర్వహిస్తామన్నారు. ఫిజికల్ సర్వేలో వ్యక్తిగత వివరాలను అడగడం లేదని స్పష్టం చేశారు. ఈ సర్వేతో జీహెచ్ఎంసీ పరిధిలో రోడ్లు, భవనాలు, చెరువులు, పార్కులు ఎన్ని ఉన్నాయి.. ఇలా ప్రతి సంఖ్య కచ్చితంగా చెప్పే అవకాశం ఉందన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ కమిషనర్ స్నేహ శబరీష్ పాల్గొన్నారు.